నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I హైదరాబాద్, గురువారం 18 ఏప్రిల్ 2024 SIDDIPET



సిద్దిపేటలో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

- శ్రీరాముడి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- సిద్దిపేటలో సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 17: శ్రీరాముడు ఆదర్శప్రాయుడని, పరిపాలన దక్షకుడు...ధర్మ నిరతుడని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని సిద్దిపేట పట్టణంలోని పలు ఆలయాల్లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరాముడు హక్కుల కంటే బాధ్యత గొప్పదని రామతత్వం ద్వారా నిరూపించారన్నారు. కష్టంలోనైనా కలిసి నడవాలని సీతా తత్వమన్నారు. కష్టాల్లో మనోనిబ్బరంతో ముందుకు సాగితేనే విజయ లభిస్తుందని శ్రీరాముడు నిరూపించారని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. శ్రీరాముడి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు.

**నాలుగు గంటలు 25 ఆలయాలు...**

సిద్దిపేట పట్టణంలోని సీతారామచంద్రస్వామి కల్యాణ ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. నాలుగు గంటలపాటు 24 ఆలయాల్లో జరిగిన కల్యాణ ఉత్సవాల్లో పాల్గొంటూనే..మరొకవైపు ప్రజలను ఆత్మీయ పలకరించారు. హౌసింగ్ బోర్డ్‌లోని పంచముఖ హనుమాన్ ఆలయం, రంగదాంపల్లి హనుమాన్ ఆలయం, హరిప్రియనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం, శివాజీ నగర్‌లోని పంచముఖ హనుమాన్ ఆలయం, హనుమాన్ టెంపుల్,దక్షిణముఖ ఆంజనేయ స్వామి ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, హనుమాన్ నగర్ ఆంజనేయస్వామి ఆలయం, షిరిడీ సాయిబాబా టెంపుల్, నాసరపుర హనుమాన్ ఆలయం, గంజి హనుమాన్ ఆలయం, పారుపల్లి వీధిలోని రామాలయం, రామరాజు రావిచెట్టు హనుమాన్ ఆలయం, కాలకుంట కాలనీ హనుమాన్ టెంపుల్, నగర్ హనుమాన్ టెంపుల్, గాంధీనగర్ హనుమాన్ టెంపుల్, నర్సాపూర్ హనుమాన్ ఆలయాల్లో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నాయకులు వంగా నాగిరెడ్డి, ఐలయ్య సంపత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు ఉన్నారు.

**వైభవంగా రాములోరి కల్యాణం**

చిన్నకోడూరు, ఏప్రిల్ 17: మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. మాచాపూర్, మేడిపల్లి గ్రా మాల్లో బుధవారం నిర్వహించిన రాములోరి కల్యాణోత్సవంలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మె ల్యే తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. కస్తూరిపల్లి, ఇబ్రహీంనగర్ పరిధిలోని రామన్నపల్లిలో నవగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముడి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, వైస్ ఎంపీపీ పాపయ్య, గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం

**ప్రత్యేక పూజలు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ**



వేల్పుగొండలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్, 17 ఏప్రిల్: మండలంలోని వేల్పుగొండ రామాచలం గుట్టపై సీతారాముల కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి రాజయోగి వెంకటస్వామి మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులను అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ భానుప్రకాశ్, ఆలయ కమిటీ భక్త బృందం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- తుది ఓటరు జాబితాపై జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మెదక్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితాపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌కు మెదక్ సమీకృత కలెక్టరేట్ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ..పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఏప్రిల్ 26 నాటికి తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు. ఎన్నికల్లో ముందస్తుగానే ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, ఓటర్ స్లిప్పుల పంపిణీ షెడ్యూల్‌పై పోటీ చేసే అభ్యర్థులకు, పార్టీలకు సమాచారం అందించాలన్నారు. గురువారం రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూట్నీ, ఉపసంహరణ, పోటీ చేసే తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్‌తోపాటు నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ జరగాలని, చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణపై ప్రతిరోజూ నివేదికలను సమర్పించాలన్నారు. కార్యక్షరమంలో డీఆర్వో పద్మశ్రీ, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్ సింగ్, ఇడియం సందీప్, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై పీడీయాక్టు నమోదు చేయాలి

చేర్యాల, ఏప్రిల్ 17: ప్రభుత్వ అనుమతి లేకుండా, అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తూ చిన్నాచితక వ్యాపారులకు అప్పులిస్తూ 10శాతం వడ్డీ వసూలు చేస్తున్న లలితా ఫైనాన్స్ భాగస్వాములను అరెస్టు చేయాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జాక్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది బైరవభట్ల చక్రధారి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ రీహబిలిటేషన్ యాక్టు ప్రకారం ఫైనాన్స్‌లు నడపాలంటే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని, ఆర్‌బీఐ నిబంధనలకు లోబడి వడ్డీలు వసూలు చేయాలన్నారు. అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేయాలన్నారు. చేర్యాలలో కొందరు వ్యక్తులు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టించి నిరుపేదలను బెదిరిస్తూ ముక్కుపిండి వడ్డీలు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులు తమ జేబులో ఉన్నారంటూ చిరు వ్యాపారులను ఫైనాన్స్ నిర్వాహకులు బెదిరిస్తున్నారని తెలిపారు. పోలీసులు ఇప్పటివరకు వడ్డీ వ్యాపారులపై తీసుకున్న చర్యలు అభినందనీయమని, తూతూ మంత్రంగా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో సిద్దిపేట పోలీస్ కమిషనర్‌కు కలిసి చేర్యాలలో వడ్డీ వ్యాపారుల ఆకృత్యాలను జాక్ బృందంతో కలిసి అందజేస్తామని చక్రధారి తెలిపారు.

# సోలాపూర్ తుల్జాభవానీ మాతకు ముడుపు

నంగునూరు, ఏప్రిల్ 17: మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలవాలని మహారాష్ట్ర సోలాపూర్‌లోని తుల్జాపూర్ తుల్జాభవానీ మాతకు బీఆర్ఎస్ నాయకులు ముడుపు కట్టారు. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సంగు పురేందర్, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు అనంతారం రఘుపతి, సోలాపూర్ బీఆర్ఎస్ నాయకులు రఘురాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తుల్జాపూర్ భవానీమాతకు మొక్కులు చెల్లిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# నత్తేనయం..!

- సిద్దిపేట జిల్లాలో నత్తనడకన ధాన్యం సేకరణ
- 418 కేంద్రాలు ఏర్పాటు
- కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- కనిపించని సౌకర్యాలు



హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు

సిద్దిపేట/దుబ్బాక/హుస్నాబాద్/చేర్యాల, ఏప్రిల్ 17: సిద్దిపేట జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో మొత్తం 418 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రాలను ప్రారంభించినా ధాన్యం కొనుగోళ్లు మాత్రం ఆశించిన స్థాయిలో చేపట్టడం లేదు. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు కేవలం వందల్లో రైతుల వద్ద మాత్రమే కొనుగోలు చేశారు. ఐకేపీ ద్వారా 210 కేంద్రాలు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 202 కేంద్రాలు, మెప్మా ద్వారా 6 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో ధాన్యం కొనడం లేదని ప్రతికల్లో కథనాలు రావడంతో అధికారులు ఇటీవల కొనుగోలు ప్రారంభించారు. అంతకుముందు వారంపాటు ధాన్యాన్ని తెచ్చిన రైతులు మార్కెట్లో పడిగాపులు పడ్డారు. మూడు రోజుల క్రితం వరకు జిల్లాలో కేవలం 167 మంది రైతుల నుంచి 876 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

**దుబ్బాకలో నియోజకవర్గంలో...**

దుబ్బాక నియోజకవర్గంలో 106 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో దుబ్బాక మున్సిపల్, దుబ్బాక మండలంలో 40 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిరుదొడ్డి మండలంలో పీఏసీఎస్ 7, ఐకేపీ 14 కేంద్రాలను ప్రారంభించారు. దౌల్తాబాద్ మండలంలో 18, రాయపోల్ మండలంలో 15, తొగుట మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. దుబ్బాకలో మార్కెట్‌యార్డు, అప్పనపల్లి గ్రామంలో మినహా మిగిలిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. దుబ్బాకలో ఐకేపీ ఆధ్వర్యంలో 27, మెప్మా ఆధ్వర్యంలో 6, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 7 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశారు. దుబ్బాక మార్కెట్ యార్డులో వారం కిందట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా..సోమవారం కొందరి రైతుల నుంచి 3 వేల బస్తాల ధాన్యం మాత్రమే కొన్నారు. అప్పనపల్లిలో కొనుగోలు చేపట్టినప్పటికీ , అక్కడ జాలి లేకపోవడంతో అదనంగా తూకం చేశారు. మిగిలిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం లేదు. రైతులు మండుటెండల్లో ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

**హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో..**

హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్రాలు ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో సెంటర్లకు రైతులు తెచ్చిన వడ్లు రోజుల తరబడి నిల్వ ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. రెండు మండలాల్లో కలిపి పీఏసీఎస్ ఆధ్వర్యంలో 27, ఐకేపీ ఆధ్వర్యంలో 13 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 27 సెంటర్లకు కేవలం 5 సెంటర్లలో మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నారు. అక్కన్నపేట మండలంలో కేవలం మైసమ్మవాగు తండా సెంటర్ మాత్రమే నడుస్తోంది. హుస్నాబాద్ మండలంలో హుస్నాబాద్ ఏఎంసీ, రాములపల్లి, మహ్మదాపూర్, నాగారం సెంటర్లలో కొనుగోళ్లు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలోని 13 సెంటర్లకు 3 సెంటర్లలో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. దీంతో మిగతా సెంటర్ల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. యాసంగి సీజన్ వరికోతలు మొదలై చాలా రోజులైంది. కొందరు రైతులు ఇప్పటికే రైస్‌మిల్లర్లకు విక్రయించారు. కొనుగోళ్లలో ఇంకా జాప్యం చేస్తే మిగతా రైతులు కూడా రైస్ మిల్లర్లకే ధాన్యాన్ని విక్రయించే పరిస్థితి ఉంటుంది. దీంతో మద్దతు ధర దక్కక రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. హుస్నాబాద్ ఏఎంసీతో పాటు మరో నాలుగు సెంటర్లలో నాలుగు రోజుల క్రితం వరకు 115మంది రైతులకు చెందిన 5,700 క్వింటాళ్ల వడ్లు మాత్రమే కొన్నారు. అన్ని సెంటర్లకు ప్యాడీ క్లీనర్లు, మాయిశ్చర్ మిషన్లు, కాంటాలు పంపినప్పటికీ కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. డబ్బు లు కూడా బ్యాంకులో త్వరగా జమకావడం లేదని రైతులు తెలిపారు. క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు ఇవ్వకపోవడంతో రైతులు నారాజ్ అవుతున్నారు.

**చేర్యాల ప్రాంతంలో..**

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా ఐకేపీ ఆధ్వర్యంలో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పది రోజుల క్రితం ప్రారంభించారు. కేంద్రాలు ప్రారంభించడంతో వడ్లు కొనుగోలు చేస్తారని రైతులు పొలాల నుంచి నేరుగా కేంద్రాలకు వడ్లను తెచ్చి రాశులుగా పోశారు. కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతుండడంతో రైతులు వడ్ల కుప్పల వద్ద కాపాలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావరణంలో మార్పులు వస్తుండడం, ఆకాశం మేఘావృత్తం అవుతుండడంతో వర్షం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా కొనుగోళ్లు చేపట్టాని కోరుతున్నారు.

## వారం రోజులుగా పడిగాపులు



హబ్షీపూర్‌లో పదిరోజుల కిందట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మేము పండించిన వడ్లను కేంద్రానికి తీసుకొచ్చాం. ఇప్పటివరకు అధికారులు వచ్చి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. రోజూ కేంద్రానికి వచ్చి పడిగాపులు కాస్తున్నాం. ఇక్కడ రైతులకు ఎలాంటి వసతులు కల్పించ లేదు. గతంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించిన వెంటనే కొనేవారు. ఇప్పుడు పది రోజులు గడుస్తున్నా వడ్లను కొనడం లేదు.

–పద్మ, మహిళా రైతు, హబ్సీపూర్ (దుబ్బాక)



సిద్దిపేట మార్కెట్ యార్డులో రైతులు ఎండబెట్టిన ధాన్యం కుప్పలు

- కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ విజయవంతం
- నాయకులను అభినందించిన గులాబీ దళపతి
- కేసీఆర్ సారే కావాలంటూ నినదించిన సబ్బండ వర్గాలు
- పార్టీ శ్రేణుల అంచనాలకు మించి తరలివచ్చిన ప్రజానీకం
- మాజీమంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ప్రచారంలో ముందున్న అభ్యర్థులు



మంగళవారం సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనవాహిని

# బీఆర్ఎస్ క్యాడర్‌లో జోష్

సిద్దిపేట, ఏప్రిల్ 17( నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎటు చూసినా జనమే జనం..కిక్కిరిసిన మైదానం... కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జామ్, మండుటెండను సైతం లెక్క చేయకుండా భారీగా తరలివచ్చిన సబ్బండ వర్గాల ప్రజలు.. మళ్లీ కేసీఆర్ సార్ కావాలంటూ నినాదాలు..గులాబీ జెండాలు చేతబూని జై కేసీఆర్, జై జై కేసీఆర్ అంటూ సభ మారుమోగింది. ఉద్యమాల పురిటిగడ్డలో కేసీఆర్ నిర్వహించిన మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభ క్యాడర్‌లో ఫుల్ జోష్ నింపింది. లక్ష మంది వస్తారని అంచనా వేయగా అంతకు మించి జనం తరలివచ్చారు. సభాస్థలి పక్కన పట్టణాలు, గ్రామాలు కూడా లేవు. అయిన కేసీఆర్ స్పీచ్‌ను వినేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా జనం భారీగా తరలివచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని తాడ్దాన్‌పల్లిలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, ఆందోల్, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ శాసనసభ నియోజకవర్గాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ఏం చేద్దాం అన్నప్పుడు కాంగ్రెస్ పార్టీని బొందపెడదాం అంటూ నినదించారు. శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 10 శాసనసభ స్థానాలకు 7 చోట్ల విజయాన్ని అందించినందుకు ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటానని కేసీఆర్ చెప్పినప్పుడు ప్రజలు జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తూ రెండు పార్లమెంట్ స్థానాలు గెలుస్తాం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత తొలి సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో నాలుగైదు రోజుల్లోనే సభను విజయవంతం చేశారు. స్థానిక శాసనసభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ ముఖ్యనేతలు సమిష్టిగా సభను విజయవంతం చేయడంతో పార్టీ అధినేత కేసీఆర్ నేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికే మండలాల వారీగా పార్టీ సమావేశాలను నిర్వహిస్తూ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందరికీ భరోసా...**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందరికీ భరోసానిచ్చారు. రైతు బంధు, సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండే.. ఫుల్ కరెంట్ ఉండడంతో పంటలు పండాయి. రైతుల ముంగిటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొన్నారు. అని సభకు వచ్చిన రైతులు చెప్పారు. కేసీఆర్ ఏం చేసాడో మాకు తెలియదు... కానీ అన్ని వర్గాలకూ భరోసానిచ్చారు. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వచ్చింది. పంటలు ఎండిపోయాయి. తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టినప్పుడు ప్రజల నుంచి స్పం దన వచ్చింది. సిద్దిపేట నుంచి ప్రారంభమైన పోస్టుకార్డు ఉద్యమానికి మంచి స్పందన వస్తున్నదని, స్వయంగా కేసీఆర్ సభలో చెప్పారు. ప్రభుత్వ హామీలపై గోవిందా..గోవిందా అంటూ దేశపతి శ్రీనివాస్ పాడిన పాటకు జనం నుంచి మంచి స్పందన వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలకే మాకు ఈ కష్టాలు ఏమిటని ప్రజలు వాపోయారు. మళ్లీ కేసీఆర్ సార్ వస్తేనే మంచి రోజులు వస్తాయని జనం చర్చించుకున్నారు.

## ఫ్రీ బస్సులు కొంప ముంచాయి..



వట్‌పల్లి/మునిపల్లి, ఏప్రిల్ 17: కాంగ్రెస్ ప్రభుత్వ ఫ్రీ బస్సులు కొంప ముంచాయి... బస్సుల్లో పోదమంటే పనులు ఉన్నవాళ్లు లేనివాళ్లు తిరుగుతుండ్రు.. చదువుకోడానికి మా బిడ్డను కాలేజీకి పంపుదామంటే బస్సుల్లా నిలవడానికి జాగలేదు. ఆటోలో పంపించే స్థోమత లేక కాలేజీ బంద్ పెట్టింశా.. బస్సుల్లో మహిళల మధ్య గొడవలు, చోరీలు జరుగుతుండె...బస్సుల్లో ఆడోళ్లకు రక్షణ కరువైంది. ప్రతి మహిళకూ నెలకు రూ.2500 ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటిదాకా ఆ ఊసు తీయడం లేదు. అబద్ధపు కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినం.... మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేయం.

-పూజల నాగమ్మ, కోహీర్

## ఆరు గ్యారెంటీలు...పచ్చి అబద్ధాలు



వట్‌పల్లి/మునిపల్లి, ఏప్రిల్ 17: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అబద్ధపు హామీలిచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసింది. బీఆర్ఎస్ హయాంలో నీటి కష్టాలు, కరెంటు కష్టాలు చూడలేదు... ఇప్పుడు ఆ కష్టాలు చూపించిన కాంగ్రెస్ పార్టీని మరువం. అప్పట్లో కాంగ్రెస్ అంటేనే కష్టాలు అనేటోళ్లు..ఇప్పుడు కనులారా చూస్తున్న..మహిళలకు ఉచిత బస్సులు తప్ప మరేదీ జరగలేదు. అబద్ధాల కాంగ్రెస్‌కు తెలంగాణలో బొందపెట్టాలే...నాలుగు నెలలకే చుక్కలు చూపించింది.

-మెతరి పార్వతి, నిజాంపేట

## తప్పుడు మ్యానిఫెస్టోతో ఓట్లు వేయించుకున్నారు..



వట్‌పల్లి/మునిపల్లి, ఏప్రిల్ 17: కాంగ్రెసోళ్లు తప్పుడు మ్యానిఫెస్టోతో తెలంగాణ ప్రజలను మోసం చేసిండ్రు.. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ నెరవేర లేదు.. బీఆర్ఎస్ హయాంలో రైతులకు కష్టాలు తెలియవు. కాంగ్రెస్ రాగానే రైతులకు కరెంటు కష్టాలు మళ్లీ తెలియజేసింది. సంక్షేమ పథకాలు ఆపేసి రైతుల నోట్లో మట్టి కొట్టింది. అలాంటి కాంగ్రెస్‌కు ఓటువేసి కష్టాలు తెచ్చుకోం. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు, నీటి కష్టాలు కనబడలేదు. సంక్షేమ పథకాలు సకాలంలో అందాయి. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటువేసీ భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. ఆరు గ్యారెంటీల కాంగ్రెస్‌ను తరిమికొడతాం.

-శ్రీనివాస్‌రెడ్డి, ర్యాలమడుగు, నిజాంపేట మండలం

## కాంగ్రెస్‌వన్నీ.. ఝూటా హామీలు..



వట్‌పల్లి/మునిపల్లి, ఏప్రిల్ 17: కాంగ్రెస్ వన్నీ..ఝూటా హామీలే..ఆరు గ్యారెంటీలని చెప్పి ఓట్లు వేయించుకొని ఫ్రీ బస్సు తప్ప ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. రైతులను నిలువునా ముంచింది. కరెంటు గోస మళ్లీ మొదలైంది. పదేండ్ల కింద తెలంగాణ ఎట్ల ఉండెనో.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే పదేండ్లు వెనక్కి వెళ్లినట్లు అనిపించింది. కేసీఆర్ సార్‌కు ఓటు వేయక చాలా తప్పు చేశాం. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొని కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం.. కాంగ్రెస్ అంటేనే మోసం అని.. మరో సారి రుజువు చేసింది.

-జింక సాయిలు, నిజాంపేట